# ఋకారము

వేదము అక్షరబ్రహ్మము. అనగా సకలసృష్టి కారణమైన మహాచైతన్యము అక్షరము గూడ అయినది; ఆ ప్రథమాక్షరముల సముదాయమే వేదము. కనుక వేదము బ్రహ్మమక్షరమెట్లైనదో చెప్పవలెను. వేదమందలి అక్షరసముదాయముతోడ బ్రహ్మమునెట్లు చేరవలయునో గూడ చెప్పవలెను. వేదమచ్చముగా ఆ రెండు ప్రయోజనముల కొఱకే అవతరించినది. వేదము అక్షరములనిన గుఱ్ఱములను మన్త్రములనిన త్రాళ్ళతో మనస్సనిన బండికి కట్టి, నిశ్చయముగా బ్రహ్మ సౌధమును జేరు మార్గమును జూపినది. కాని, ఆ అక్షరములకు బ్రహ్మయుండు చోటు తెలిసినపుడు గదా, మన లనచ్చటకు కొనిపోవుట! అక్షరములు ఆ చైతన్యోద్భవములనియు, మనలనచ్చటికి కొనిపోవుట వాని సహజలక్షణ మనియు, వేదము విశదముగా తెలియజెప్పినది.

అక్షరములు (syllables) రెండు రకములు – అచ్చులు (vowels) హల్లులు (consonants) నాభివద్ద పుట్టిన సంచలనము, కంఠనాళమునుండి (larynx) అచ్చుగానే వెలికి వచ్చును. నోటియందు, నాలుక, నోటి పై భాగము, దంతములు, పెదిమలు, ఒకదానికి మరియొకటి తగులుటచత (స్పర్శ) హల్లులు పుట్టుచున్నవి. అచ్చులు, హల్లుల కలయికలే శబ్దములు (words) శబ్దసమూహమే భాష. నాభి వద్ద పుట్టిన సంచలనము ఊపిరితిత్తులలోని గాలిని, నోటి వెంట శబ్దముగా బయటకు వచ్చునట్లు చేయుచున్నదిగదా! ఆ బయలుదేరిన వాయుప్రవాహము, దారిలో మన శరీరమునందలి అనేకములైన అందములచేత ప్రభావిత మగుచున్నది. ఊపిరితిత్తులు, వానిచుట్టునున్న బొమికల గూడు, పొట్టకును రొమ్మునకు మధ్యనున్నవప (diaphragm) కంఠనాళములు, క్రింది దవడ, నోటి పైభాగము, నాలిక, దంతములు, పెదిమలు – వీటి అన్నిటి కదలికలు ఆ ప్రవాహస్వరూపమును, దాని లక్షణములను మార్చుచు న్నవి. ఇంతియే కాదు. ఈ కదలికల వలన నోరు, ముక్కు, కంఠనాళముల క్రింద, పైన ఉన్న భాగముల పరిమాణము (size) మారుచున్నది. అనగా పుట్టిన ధ్వనులు ప్రతిధ్వనించు గహ్వరముల (resonance cavities) ఆకార పరిమాణములు మారుచున్నవి. ఈ కదలికల వలన, ఈ మార్పులవలన మన వాగ్యంత్రము పుట్టించగలిగిన ధ్వనులు అనేకములు. కాని అందరు మానవులును అన్ని ధ్వనులను పుట్టించలేరు. కొందరు కొన్ని మాత్రమే. ఇది సృష్టి లక్షణము. వేదమేమి చెప్పుచున్నదనగా ఒక్కటి అయిన పదార్థము అనేకమయినది. అనేకమగుచున్నది. ఆ అనేక మగుటకూడ అనేకవిధములుగ. మానవులు అనేక జాతులు. మరల ఒకే జాతియందు అనేక భేదములు. ఈ భేదముల కనేక కారణములు చెప్పవచ్చును. శీతోష్ణస్థితులు, తినుచున్న ఆహారమందలి భేదములు ఎన్ని చెప్పినను ఈ సృష్టి యందు వైవిధ్యము సహజము. అందువలన మానవుల అక్షరోచ్చారణమునందు భేదములు కనపడుచున్నవి. ఇటలీ దేశస్థులు ట, డ అక్షరములను అంత సులభముగ పలుకలేరు. ఈ, ద లను వాడుదురు. వియత్నాం భాషలో అనునాసిక వర్ణములు (nasal consonants) ఎక్కువ.

ప్రతి భాషయందును కొన్ని అచ్చులు, కొన్ని హల్లులు ఉన్నవి కదా! అవి ఆయా భాషలు మాటాడువారి ఉచ్చారణ శక్తిసౌలభ్యములమీద నాధారపడి యుండును. మాట అనగా అక్షరము వెంబడి మరియొక అక్షరము వెలికి వచ్చుట. అది హల్లులవలన కుదరదు. హల్లు (క్, చ్, ట్....) పలికిన తరువాత లోనుండి వచ్చుచున్న వాయువు ఒక్క క్షణమాగి, తిరిగి ఉచ్చరించుటకు అనువైన ప్రవాహము నారంభించును. కనుకనే వట్టి హల్లులతో మాటలుండవు. అచ్చుతో కలసినపుడే మాట. హలంతములైన మాట లుండును.

భాషకు అచ్చులు ప్రధానము; ఏ భాష అచ్చులా భాషవి. అన్ని భాషలకు అచ్చులు సమానముగా నుండవు. ఇంగ్లీషుభాషలో అచ్చులుఐదు. సంస్కృతమునందు అచ్చులు 14. సంస్కృతభాష వేదభాషనుండి పుట్టినది. అందు వలన వేదభాషలోనున్న అచ్చులే సంస్కృతమునందుగూడ నున్నవి. అవియే సంస్కృతమునుండి పుట్టిన దేశభాషల లోనికి వచ్చినవి.

పాణిని వ్యాకరణమునందు వేదభాషలోను, సంస్కృతభాషలోను ఉన్న అక్షరములను 14 సూత్రములలో చెప్పెను. వానికి శివసూత్రములని పేరు. అందు మొదట నాలుగు సూత్రములలో అచ్చులున్నవి. ఆ సూత్రములు :

1) అ ఇ ఉణ్ 2) ఋ ఌ క్ 3) ఏ ఓ ఙ్ 4) ఐ ఔ చ్

ఈ సూత్రములలో చివరనున్నవి హల్లులు. ఆ హల్లులకు వెనుక నున్నవి అచ్చులు. అచ్చు అనగనే కంఠ నాళమునుండి నోరుదాటి బయటకు వచ్చువరకు ఎచ్చటను అడ్డుగాని స్పర్శగాని ఉండని ధ్వనికదా! ప్రపంచము నందలి అన్నిభాషలయందలి వ్యాకరణములును, అచ్చునకు ఇంచుమించుగా ఇట్టి నిర్వచనమునే ఇచ్చినవి. ఋ-కార, ఌ-కారములను స్పర్శలేకుండ ఉచ్చరింపలేము. ఋ, ఌ కారములనుచ్చరించుటకు ప్రయత్నించినచో, మనముచ్చరించునవి ర, ల అను హల్లులు. వీనిని ఎవరికి వారు ప్రయత్నించి చూడవచ్చును. స్పర్శలేకుండ ఉచ్చరింపలేము కనుక, మరి ఏ భాషలోనను ఋ-కార, ఌ-కారములనిన అచ్చులు లేవు. ర, ల అను హల్లులే ఉన్నవి. వేదభాషయందు ర, ల అను హల్లులు ఉన్నవి; ఋ,ఌ అను అచ్చులుగూడ ఉన్నవి.

వేదము, మనము ర, ల అను హల్లులతో గూడిన ధ్వనులనేగాక, ఋ, ఌ అను స్పర్శలేని ధ్వనులను గూడ పలికెదమనుచున్నది. కాని మనమెంత ప్రయత్నించినను పలుకలేకున్నాము. ఇది ఆలోచించవలసిన విషయము. వేదము హల్లులను వర్ణములనియు, అచ్చులను స్వరము లనియు చెప్పుచున్నది[1].

శివసూత్రములలో మొదటిదానియందు ప్రథమస్వరము – అ. శిశువు పుట్టగనే అకారస్వరముతో రోదన మారంభించును. ప్రాణి భూమి మీద పడినదనిన జ్ఞానము కలుగగనే పలికెడి స్వరము అకారము. అందువలన వేదభాష యందు ప్రథమస్వరము ప్రాణి ప్రథమజ్ఞాన లక్షణమైన అ. శిశువు ఇ-కార, ఉ-కార, స్వరములు పలుకుటకు కొంత కాలము పట్టును. ఇ-పలుకుటకు నాలిక, పైనున్న తాలువునకు కొంచెము దగ్గరకు పోవలయును. ఉ-కారమునకు

పెదిమలు గుండ్రము సేయవలయును. ప్రయత్నమెక్కువ. ఒకరు చెప్పనక్కరలేదు. శిశువు తనకు తానుగా నేర్చుకొనును. హల్లులుచ్చరించుటకు స్పర్శ తెలియవలెను. అది మాటల నారంభించు వయసు. స్పర్శ జ్ఞానము కలిగిన తరువాత పలికెడునది ర, ల గాని, ఋ, ఌ స్వరములు కాదుగదా! ఋ,ఌ స్వరములు (అచ్చులు) శిశువు ఎప్పుడు పలుకును? శిశువు ప్రథమరోదనము జాగ్రత్తగా పరిశీలించినచో ప్రాణమాయాసమై, ఆక్రందనము తగ్గినవేళ, గుటక మ్రింగి, తిరిగి రోదనమారంభించువేళ, స్పర్శ రహితమైన ఋ-కార, ఌ-కార ధ్వనులు వినవచ్చును.ఈ స్వరములను ప్రథమశిశురోదనమందు ఎవరైన వినవచ్చును. ప్రసూతి వైద్యులకు మరియు సులభము. స్పర్శ వలన కలుగు ర, ల – ధ్వనులయందు భేదము కానవచ్చునుగాని, కంఠనాళమునందు, ప్రత్యేకముగ పసివాని కంఠమందలి ఋ, ఌ స్వరముల భేదము కించిత్తు జాగ్రత్తతోడ వినినచో భేదము స్పష్టమగును. శిశువు జ్ఞానము పెరిగినకొలది, కంఠమునుండి ఋకారము మాయమగును. మొదటి ఆక్రందనము లౌకిక జ్ఞానముతోడ కాదు. ఆకలితోడ ఏడ్చుటలేదు. నాకిది కావలెనని కాదు. నేను మరియొక ప్రాణి నేతెంచినానని. కదలిక ఎట్లు ప్రాణియొక్క లక్షణమో, అట్లే శబ్దముగూడను. ఆ ఋకారము ప్రాణలక్షణము. దానికి లౌకిక జ్ఞానముతోడ సంబంధము లేదు. తరువాత, నా కాకలి యగుచున్నది, నా శరీరము తడి అయినదని ఏడ్చువేళకు, ఋకారము మాయమయినది. వేదమీ స్వరమును ఋతము అనుచున్నది. అది బ్రహ్మము. ఋతగ్ం, సత్యం, పరం, బ్రహ్మపురుషం, అని తైత్తిరీయోపనిషత్తు నందలి నారాయణీయము. వేదము ఋకారము గాని, ఋకారముతోడి శబ్దములనుగాని ఉపయోగించినదనగా అచ్చట మానవశక్తి, జ్ఞానముల కతీతమైన విషయములను వివరించుచున్నదని భావింపవలయును. అనంతమైన మహా చైతన్యము యొక్క మనమూహింపలేని శత సహస్రములైన కార్యములలో అచ్చటకు సంబంధించిన కార్యమును గురించి చెప్పుచున్నదని తెలియవలెను. ఋక్కు అనగా మానవాతీతములయిన శక్తులను (దేవతా) స్తోత్రము సేయుట. మానవశక్తిలో లేనివి, మానవునకు కావలసినవి అయిన ఆయురారోగ్యైశ్వర్యములను వాంఛించుట. తనకు లేని దానిని వాంఛించుట మానవసహజము. సృష్టి ఆరంభమునుండి, అంతము వరకు ప్రతి మానవుడువాంఛించు భాగ్యములు, ఆ భాగ్యాధిపతులను గురించిన స్తోత్రములే ఋగ్వేదము. మనము బయటకు చెప్పినను, చెప్పకపోయినను, మన ఆయుర్దాయము పెరుగుటెటులనా అని మన హృదయములందు మ్రోగుచునే యుండును. దానిని తీసివేయదలచినను, తీసివేయలేము. ఆ ఆవేదన, ఆ వాంఛ, ఆ ఆక్రోశము యొక్క వాగ్రూపమే ఋగ్వేదము.

స్పర్శ జ్ఞానము వచ్చిన తరువాత పలికెడిది ర. ర-ను పలికెడివారు రుద్రుడు. రుద్ర శబ్దమునకు అనేకములైన అర్థములు చెప్పవచ్చును. రుదిరమనగా అశ్రువిమోచనము. కంటివెంట నీరు కార్చుట. రుద్రుడనగా ఏడ్చెడివాడు; ఇతరుల దుఃఖమును మాన్పెడివాడు. శత్రువులను (తన కిష్టము లేని వారిని) దుఃఖ పెట్టువాడు.

తాను దుఃఖించుట, ఇతరులను దుఃఖపెట్టుట, తనతో పాటు ఇతరులనుగూడ దుఃఖమునుండి బయటకు వచ్చు ప్రయత్నము సేయుట – ఈ మూడును సమస్తజగత్తుయొక్క వ్యాపారమును, బ్రతుకురీతిని తెలియజేయుచున్నవి. ఇది ఎవరికి వారు ఆలోచించుకొనినచో తెలిసెడి విషయము. కనుక ఈ జగత్తు రుద్రవ్యాపారము.

యజుర్వేదమునందలి చతుర్థకాండలోని పంచమప్రశ్న మన్త్రములకు, రుద్రాధ్యయనమనియు, శతరుద్రీయ మనియు, నమక, చమకములనియు పేర్లు. ఆమన్త్రములన్నియు, అనంతరూపములుగా ఈ జగత్తునందున్న రుద్రరూపులను తెలియజేయుచున్నవి. ఆ మన్త్రములు ఈ జగత్తు యొక్క అక్షరముల (వర్ణముల) ప్రతిరూపము. అందు దొంగలు, మోసగాండ్రు, ధాన్యములు, తీర్థములు, వర్షములు, అవర్షములు, పృథివి, అన్తరిక్షము, నదులు, పర్వతములు–జగత్తు సర్వమును జూడవచ్చును.

ఋకారమైన బ్రహ్మము రుద్రమైన జగత్తుగా పరిణమించిన విధానమును చెప్పు మన్త్రములగుటచేత, రుద్రాధ్యాయమున మొదటి పదిహేను మన్త్రములును ఋక్కులు. తరువాత యజస్సులు. ఋక్కులు స్తోత్రములయినట్లు యజస్సులు యజ్ఞములు (శ్రేష్ఠమయిన కర్మలు) చెప్పు మన్త్రములు. ఈ రుద్రులందరు కర్మలు సేయువారు గాన రుద్రాధ్యాయము ప్రధానముగ యజుర్మంత్రములతో గూడినది. రుద్రాధ్యాయము యజ్ఞప్రధానమైన యజుర్వేదమునందున్నది. ఈ రుద్రవర్ణనములో ప్రతి రుద్రుని హృదయము నందును ఋకారరూపమైన బ్రహ్మము నిక్షిప్తమై ఉన్నదనిన ఋతము (సత్యము) మరచిపోకుండుటకు, చివరి అనువాకములోని (యజు 4.5.11) 13 మన్త్రములలో మొదటి పది మన్త్రములు ఋక్కులు. తుదివైన మూడును యజస్సులు. వేదమీవిధముగ జగద్హృయమునందు బ్రహ్మమున్నదని, అక్షరములచేతనే గాక, మన్త్రములందు వాడిన ఛందస్సులతో గూడ తెలియజెప్పుచున్నది. అది వేదము!

ఋకారమును స్పర్శజ్ఞానము కలిగిన తరువాత పలుకలేకున్నాము. మనయందేగాక, విశ్వమంతయునున్న ఋకారమును వినుట ఎట్లు? పృథివి, ఆపస్సు, తేజస్సు, వాయువు, ఆకాశము– వీనిలో ఎప్పుడు మార్పులు వచ్చినను, అనగా వానిలోని చైతన్యము వానిని కదలించి నప్పుడు, ఋకారమును వినవచ్చును. సముద్రఘోషలో, మేఘగర్జనములో, అగ్నిపర్వతము నిప్పులు గ్రక్కువేళ, ఋకారము స్పష్టముగా వినపడును. కాని మనయందు, లోనున్న ఋకారమును పలుకవలెనను ఇచ్ఛ కలుగగనే రకారమగుచున్నది. ఇచ్ఛ వెంట బయటకు వచ్చుచున్నది. వేదమునందున్న ఈ ఋతమును (నిత్యమైన సత్యమును), ఋగ్వేదమునకు ప్రాతిశాఖ్యము వ్రాసిన శౌనకమహాముని తన సూత్రములయందు చెప్పెను. రేఫోకర్త్యృకారే (శిక్షాపటలము, 34 వ సూత్రము) దీనికి ఉవ్వటుడు తన భాష్యమునందు ఋకారే రేఫః విద్యతే, అని వ్యాఖ్యానించినాడు. అనగా ఋకారమునందే రకారము ఉన్నది అని అర్థము. రకారరూపమయిన ఈ జగత్తంతయు ఋకారమైన బ్రహ్మమందున్నది. ఋకారము ఇచ్ఛతోడ ర–కార మగుచున్నది. ఆ బ్రహ్మము చేసిన పనియే మననము చేయుచున్నాము. ఇచ్ఛవలననే, మనలో నున్న శక్తిని దస్తురూపముగ, పుస్తకరూపముగ, భావ రూపముగ, వాగ్రూపముగ, (ఈ వ్యాస రూపముగ గూడ) బయటకు తెచ్చుచున్నాము.

వేదము బ్రహ్మమును, ఆ బ్రహ్మమునుండి వినిర్గతమైన ఈ సృష్టిని మనకు అనేకవిధముల తెలియజేయును. ఇది అక్షరవిషయముగా తెలియజెప్పిన పద్ధతి.

ఇకార, లకారములను గురించి విచారించుట మరియొకసారి. ప్రస్తుతము మనయందీ ఋకారమెచ్చట నున్నదో చూడవలెనుగదా!

ఋచో అక్షరే పరమే వ్యోమన్, అని ఋగ్వేదము (1–164–39) అక్షరమైన (నాశనము కాని) ఋకారము, పరమమైన (శ్రేష్టమయిన) వ్యోమమునందు (ఆకాశము నందు) ఉన్నది. బయటనున్న ఆకాశము ఎట్లు శబ్దమయమో, అటులనే మనయందున్న ఆకాశముగూడ. అక్షరమైన ఆ ఋకారమున్న ఆకాశము పరమముగాక వేరగునా? ఈ ఋక్కు ఒక్క ఋగ్వేదమునందు మాత్రమేకాదు. అథర్వ వేదమునందు (9–10–18), తైత్తిరీయ బ్రాహ్మణమునందు (3–10–9–14), తైత్తిరీయారణ్యకమునందు (2–11–1) కూడనున్నది. ఆయాచోటులందు తిరిగి ఎందుకు చెప్ప బడినదో విచారించవలసిన విషయము. ఎందుకనగా, వేదమునందు ఒక్క వర్ణము (హల్లు) గాని, స్వరము (అచ్చు) గాని, స్వరము (ఉదాత్త–అనుదాత్తస్వరములు) గాని, మాత్ర (హ్రస్వ, దీర్ఘ, ప్లుతములు) గాని, సామ (ఋగ్యజు స్సామ ములు) గాని, సంతానము (సంహితా, బ్రాహ్మణ, ఆరణ్యక, ఉపనిషత్తు) గాని, పునరుక్తి (చెప్పినదే తిరిగి చెప్పుట) గాని, ప్రయోజనము లేకుండ ఉండదు.

అట్టి వేదమునందును, మీయందును, నాయందును, అందరియందును ఉన్న ఋకారమునకు నా నమస్కారము.

1. **శిక్షాం వ్యాఖ్యాస్యామః వర్ణః స్వరః మాత్రాబలం సామ సంతానః ఇత్యుక్తః శిక్షాధ్యాయః**

(తైత్తిరీయోపనిషత్తు, ద్వితీయోనువాకము)

శిక్షను వ్యాఖ్యానింతము. వర్ణములు, స్వరములు, మాత్రలు, బలము, సామము – ఇది సంతానము. ఈ విధముగా శిక్షాధ్యాయము చెప్పబడినది.

**వర్ణము:** హల్లు అచ్చునకు రంగునిచ్చునది. ప్రాతి శాఖ్య గ్రంథములయందు హల్లులకు వ్యంజనములని గూడ పేరు.

**స్వరము:** అచ్చు – దీని సహాయముతోడనే వర్ణముచ్చరింపబడును. ఈ స్వరము మీదనే ఉదాత్త, అనుదాత్త , స్వరితములనిన మూడు విధములుగ ఉచ్చరించుట జరుగును. అందువలన స్వరములనిన – ఉదాత్త, అనుదాత్త, స్వరితములని గూడ అర్థము చెప్పవచ్చును.

**మాత్ర:** ఉచ్చరించు కాలనియమము. (హ్రస్వ, దీర్ఘ, ప్లుతములు)

**బలము:** ఉచ్చరించుటకు మనము చేయు ప్రయత్నము.

**సామ:** పైన చెప్పిన నియమములను పాటించుచు సమముగా తొందరపడకుండ, ఎక్కువ నెమ్మది గాకుండ, ప్రత్యక్షరము పలుకుట.

**సంతానము:** పైన చెప్పిన వన్నిటిని వేరువేరుగా భావింపక, అన్నిటిని కూడ గట్టి, ఒకటియైన ప్రవాహముగా నుచ్చరించుట.

**శిక్ష:** మనస్సు మనలో నున్న జ్ఞానమును వాగ్రూపమునకు, తెచ్చును. అటులనే బయటనుండి వచ్చిన అక్షరమును కంటితో చూచిగాని, చెవితో విని గాని, నోటితో పలికి గాని, జ్ఞానముగా మార్చును. ఈ మూడు క్రియలలో నోటితో పలికిన వేళ, మనస్సాక్రియయందు ఎక్కువ కాలము గడుపును. లోనున్న భావమును అక్షరరూపమున వెలికి తెచ్చువేళ, మన వాగ్యంత్రము ఏపనులుచేయుచున్నదో (ఉచ్చారణమునందు) ఆ పనులు నొక్కదానిని వేరుజేసి (పైనచెప్పిన స్వర, బలాదులను) ఒక్కొక్క దానికి ఎంత స్వరమో, ఎంత బలమో నిర్ణయము జేసి, వేదము తన మంత్రములను మనస్సును అధ్యయనము జేయుమనినది. అనగా పలుకుమనినది. ఈ పలుకుటలో మనస్సు ప్రతి అక్షరమునందు తగినంత కాలము నిలుచుట చేత, అక్షరములయందున్న (శబ్దములయందున్న) భావమును జ్ఞానముగా మార్చుట ఎక్కువ ఫలవంతముగా జరుగుటకువీలు కలిగినది. మనస్సునకు ఎందు ఎక్కువ కాలము గడిపిన, ఆ వంకకు మొగ్గుట అలవాటు. వేదమన్త్రములు బ్రహ్మభావగర్భితములగుటచేత, మనస్సు బ్రహ్మభావాభిముఖమగుచున్నది. అక్షరములను నియమిత స్వర, మాత్ర, బలయుతముగా నుచ్చరించుటను వేదము శిక్ష యనుచున్నది. యోగశాస్త్రముచేత మనస్సును దృఢపరచి, ప్రాణాభివృద్ధి కల్పించినట్లు, శిక్షాశాస్త్రము చేత మనస్సును పటిష్ఠము చేసి జ్ఞానాభివృద్ధికి వేదము దారి జూపినది.